క్లుప్తంగా

వేసవిలో తాగునీటి ఇక్కట్లు రావొద్దు

జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీఓ దేవకీ దేవి

వర్గల్(గజ్వేల్): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి ఆదేశించారు. శనివారం వర్గల్ మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ ఖలీమ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీధర్‌తో కలిసి తాగునీటి సరఫరాపై సమీక్షించారు. గ్రామాలలో రక్షిత తాగునీటి సరఫరా విషయంలో అలసత్వం కూడదన్నారు. పైపులైన్ లీకేజీలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. వేలూరు, మైలారంలో మరమ్మతులు జరుగుతున్నట్లు ఎంపీఓ వివరించారు.

బిల్లులు చెల్లించకుంటే ఆత్మహత్యలే శరణ్యం



మాట్లాడుతున్న ఎంపీటీసీ స్వరూప

కోహెడ (హుస్నాబాద్): అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేయించామని, ఏడాది గడిచినా బిల్లులు రాలేదని తమకు ఆత్మహత్యే శరణ్యమని ఎంపీటీసీ, బీజేపీ మండల అధ్యక్షుడు స్వరూప, వెంకటేశం ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనులు చేసిన ప్రజాప్రతినిధులను బావిలో తోస్తే, ఇప్పుడొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బావిలో పడ్డవారిపై బండలు వేస్తున్నట్లుగా తయారైందన్నారు. తాము చేసిన పనులకు ఖజానాలో డబ్బులు లేవని చెబుతున్నారని, బిల్లులు కోసం ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నామని వాపోయారు. చెక్కులను ఎస్టీఓ ఆఫీస్‌లో ఇస్తే తిరస్కరించారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకొని పెండింగ్ బిల్లులు ఇప్పించి తమను ఆదుకోవాలని కోరారు.

బీఆర్‌ఎస్ బీసీ సమన్వయ కర్తగా శ్రీనివాస్ గౌడ్



శ్రీనివాస్ గౌడ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి

దుబ్బాకటౌన్: బీఆర్‌ఎస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ బీసీ సమన్వయకర్తగా దౌల్తాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రణం శ్రీనివాస్ గౌడ్ శనివారం నియమితులయ్యారు. ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శాలువా కప్పి సత్కరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి కోసం సైనికుడిగా పనిచేయాలన్నారు. కాగా శ్రీనివాస్ గౌడ్ 20 ఏళ్లుగా పార్టీ దౌల్తాబాద్ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

కాంగ్రెస్ పేదల పక్షమే

డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు



చిన్నకోడూరులో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్ ఎప్పుడూ పేదల పక్షాన నిలబడుతుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఆరు గ్యారంటీలను నేరవేరుస్తారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు ఉపాధి మార్గాల కోసం కాంగ్రెస్ కృషి చేస్తోందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను నమ్మొద్దన్నారు. మెదక్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును గెలిపించాలన్నారు. అనంతరం మెదక్‌లో జరిగే సీఎం సభకు తరలివెళ్లారు.

అందుబాటులో సాంకేతిక విద్య

- జిల్లాలో ఐదు పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు
- ఆరు బ్రాంచీల్లో 720 సీట్ల భర్తీ
- ఈనెల 22 వరకు పాలీసెట్ దరఖాస్తులకు గడువు
- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలంటున్న విద్యావేత్తలు



హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థినులు

గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కోర్సు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగాలు పొందేందుకు సులభమార్గమని విద్యావేత్తలు చెబుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులకు పాలిటెక్నిక్ అనుకూలంగా ఉంటుందంటున్నారు. ఈ కాలేజీలు ప్రస్తుతం పల్లెల్లోనే ఏర్పాటు చేస్తుంటంతో వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

హుస్నాబాద్ రూరల్: సాంకేతిక విద్యను అభ్యసించి త్వరగా ఉద్యోగాలు పొందే పాలిటెక్నిక్ విద్య గ్రామీణ విద్యార్థులకు అందుబాటులోకి వచ్చింది. 10వ తరగతి పూర్తి చేసిన తర్వాత పాలీసెట్ ప్రవేశ పరీక్ష ద్వారా డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) నిర్వహించే జూనియర్ ఇంజనీర్ (జేఈ) ఉద్యోగాలు సాధించే అవకాశం ఉంటుంది. టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన అసిస్టెంట్ ఇంజనీరింగ్ (ఏఈ) ఉద్యోగాలకు కూడా డిప్లొమా పూర్తి చేసి విద్యార్థులు అర్హత పొందుతారు. జిల్లాలో ఐదు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఆరు బ్రాంచీల్లో 720 సీట్లు ఉన్నాయి. విద్యార్థులు పాలీసెట్ రాసిన తర్వాత కౌన్సిలింగ్ ద్వారా సీట్లు పొందుతారు. గత విద్యా సంవత్సరం సీట్లు భర్తీ కాకపోవడంతో మిగిలిపోయాయి. విద్యార్థులకు సాంకేతి విద్యపై అవగాహన లేక పాలీసెట్ రాయక స్పాట్ అడ్మిషన్లకు వస్తున్నారు. గ్రామీణ విద్యార్థులను పాలీసెట్ రాసేలా ప్రోత్సహిస్తే వారికి ఉజ్వల భవిష్యత్ కల్పించినవారవుతారని విద్యావేత్తల అభిప్రాయం. 2024 పాలీసెట్ ప్రవేశ పరీక్ష చివరి తేదీ ఈనెల 22తో ముగియనుంది.

బీటెక్ ద్వితీయ సంవత్సరంలో..

సిద్దిపేట జిల్లాలో ఐదు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు ఉండగా అందులో ఆరు బ్రాంచీల్లో 720 సీట్లు ఉన్నాయి. హుస్నాబాద్‌లో సివిల్, ఈఈఈ బ్రాంచీల్లో 120 సీట్లు, చేర్యాల సివిల్, ఈఈఈలో 120 సీట్లు, గజ్వేల్ ఈఈఈ, సీసీపీ, మెకానికల్‌లో 180 సీట్లు, సిద్దిపేట (బాలికల) ఈఈఈ, సివిల్, సీఎస్‌సీలో 180 సీట్లు, సిద్దిపేట-2 (రాజగోపాల్‌పేట)లో ఈఈఈ, సీఎస్‌సీలో 120 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లకు గ్రామీణ ప్రాంతంలో ఉండటంతో ఎక్కువ మంది పల్లెటూరి విద్యార్థులు ఇంటి నుంచి కాలేజీలకు రావడానికి రవాణ సౌకర్యం ఉంది. డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ పూర్తి చేయడానికి బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందొచ్చు.

గ్రామీణ విద్యార్థులకు సదావకాశం



సాంకేతిక విద్యను అభ్యసిస్తే త్వరగా ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుంది. గ్రామీణ విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు అందుబాటులోకి వచ్చాయి. పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. డిప్లొమా పూర్తి చేసిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. డిగ్రీ పూర్తి చేయకుండానే వారి నైపుణ్యంతో ఉద్యోగాలు సాధించి స్థిరపడొచ్చు.

– డాక్టర్, కె.అశోక్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, హుస్నాబాద్

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తిభావం

- జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తి భావం పెంపొందుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. శనివారం మండల పరిధిలోని గంగాపూర్‌లో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ భక్తి భావం అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పెద్దమ్మ దయతో ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గ్రామాల్లో ఆలయాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రామాగౌడ్, లింగారెడ్డి, సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

నిర్మాణాలకు నిధులు ఇవ్వండి

- ఎంపీపీ లకావత్ మానస



వినతి పత్రం అందజేస్తున్న ఎంపీపీ మానస

హుస్నాబాద్‌రూరల్: షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీపీ లకావత్ మానస మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం కరీంనగర్‌లో ఎంపీటీసీలతో కలిసి హుస్నాబాద్ అభివృద్ధిపై మంత్రితో చర్చించినట్లు చెప్పారు. ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు ఇవ్వకపోవడంతో కార్యాలయాల నిర్వహణ భారమవుతోందన్నారు. ఆదాయ వనరులను సృష్టించుకోనేందుకు మండల పరిషత్ సమీప కరీంనగర్ రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేయాలని కోరారు. దీనికి మంత్రి స్పందించి ఎలక్షన్ కోడ్ ముగిసిన తర్వాత అభివృద్ధికి కావల్సిన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎంపీపీ తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల, ఎంపీటీసీలు బొమ్మగాని శ్రీనివాస్, జయలక్ష్మి, పిట్టల శ్రావణి, పోతారం మాజీ సర్పంచ్ బత్తిని సాయిలు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

సిద్దిపేటకమాన్: ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ క్యూఆర్ కోడ్ వినియోగిస్తున్న వ్యక్తి ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా చెక్కును కంపెనీ ప్రతినిధులు అందజేశారు. సిద్దిపేటలోని సుభాష్ నగర్‌కు చెందిన రెడ్డబోయిన మల్లేశం వ్యాపారం చేస్తున్నాడు. అతడు తన షాపులో ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ క్యూఆర్ కోడ్ వినియోగించాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడి క్యూఆర్ కోడ్‌కు సంబంధించిన ప్రైమ్ సబ్‌స్క్రిప్షన్ తీసుకున్నాడు. దీంతో ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ రూ.10 లక్షల ప్రమాద బీమా చెక్కు రూపంలో విడుదల చేసింది. బీమా చెక్కును మృతుడి భార్యకు ఎయిర్‌టెల్ బ్యాంక్ ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో ఎయిర్‌టెల్ బ్యాంక్ ప్రతినిధులు విజేందర్‌రెడ్డి, కుమారస్వామి, భీమ్ రాజ్, రామరాజు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ ప్రతినిధులు

కుళ్లిన కోడిగుడ్ల పంపిణీపై విచారణ

సాక్షి ఎఫెక్ట్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈనెల 17వ తేదీన 'కుళ్లిన కోడిగుడ్ల పంపిణీ' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి సీడీపీఓ జయమ్మ స్పందించారు. శనివారం మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో విచారణ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు వచ్చిన వెంటనే బాలింతలు, గర్భిణులకు పంపిణీ చేయాలన్నారు. కోడిగుడ్ల పంపిణీలో అలస్యం చేయడంతో గుడ్లు కుళ్లిపోతాయన్నారు. మరోసారి పంపిణీలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత, గ్రామ మాజీ సర్పంచ్ పిచర రాములు, గ్రామస్తులు, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.



కోడిగుడ్ల పంపిణీపై విచారణ చేస్తున్న సీడీపీఓ జయమ్మ

మేకల దొంగల ముఠా అరెస్ట్

తొగుట(దుబ్బాక): మేకల దొంగల ముఠాను శనివారం అరెస్ట్‌చేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు తొగుట సీఐ లతీఫ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసులు గజ్వేల్ మండలం కొల్గూరు, తొగుట మండలం చందాపూర్ గ్రామాల చౌరస్తా వద్ద శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఏపీ 09ఎక్యూ 4198 నంబర్‌గల కారులోని వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని చాకచక్యంగా పట్టుకున్నారు. వారిని విచారించగా తూప్రాన్‌కు చెందిన మహ్మద్ నసీరుద్దీన్ (33), మహ్మద్ షాదుల్ అలియాస్ భుజాంగు (24), మజీద్‌పల్లి సురేష్ (35) అరికెల మల్లేశం (23), వాన్కర్ శ్రీనివాస్ (29) ముఠాగా ఏర్పడి మేకలు, గొర్రెలను దొంగతనం చేస్తున్నారు. వాటిని విక్రయించి జల్సాలు చేస్తున్నారు. వీరిలో మహ్మద్ నసీరుద్దీన్, మహ్మద్ షాదుల్ అలియాస్ భుజాంగు, మజీద్‌పల్లి సురేష్ పట్టుబడగా, మిగిలిన ఇద్దరు పరారయ్యారు. వీరంతా కూలి పనులు చేస్తుంటారు. సంపాదన చాలకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. గొర్రెలు, మేకలను ఎత్తుకెళ్లి వాటిని విక్రయించి సమానంగా పంచుకొని జల్సాలు చేసేవారు. శనివారం దొంగతనం చేసేందుకు గజ్వేల్ నుంచి కొల్గూరు వస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.72 వేలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మహ్మద్ నసీరుద్దీన్, మహ్మద్ షాదుల్, సురేష్‌ను కోర్టు ఆదేశాల మేకు రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న అరికెల మల్లేశం, వానకారి శ్రీనివాస్‌ను త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు. దొంగలను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ లింగం, సిబ్బందిని సీఐ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ లతీఫ్

ప్రధాన న్యాయమూర్తి బదిలీ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి డాక్టర్ టి.రఘురాం బదిలీ అయ్యారు. హైదరాబాద్ సీబీఐ ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జిగా బదిలీ చేస్తూ శనివారం రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు వెలువరించింది. ఆయన స్థానంలో హైదరాబాద్ నుంచి తెలంగాణ వాల్యుయాడెడ్ ట్యాక్స్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్ కె.సాయిరమాదేవి నియమితులయ్యారు. అదేవిధంగా జిల్లా అదనపు సెషన్స్ జడ్జి మురళీమోహన్‌ను హైదరాబాద్ సివిల్ కోర్టు అదనపు చీఫ్ జడ్జిగా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్‌గ్రామానికి చెందిన బీ.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు ,మాజీ సర్పంచ్ మేర్గు శ్రీనివాస్ గౌడ్, మండల కురుమ సంఘం సభ్యులు శనివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భవానీరెడ్డి ఆధ్వర్యంలో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రతాప్ రెడ్డి పార్టీ కండువా వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

నంగునూరు(సిద్దిపేట): అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని శనివారం రాజగోపాల్‌పేట పోలీసులతో కలసి స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నంగునూరు మండలం గట్లమల్యాలకు చెందిన పోగుల సతీష్ బెల్ట్‌షాపు నడుపుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు దాడి చేయగా బీర్లు, విస్కీ బాటిళ్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రాజగోపాల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

తండ్రితో గొడవ పడి..

ఇంటి నుంచి వెళ్లిన కొడుకు

గజ్వేల్‌రూరల్: తండ్రితో గొడవపడి ఇంటి నుంచి కొడుకు వెళ్లిపోయాడు. ఈ ఘటన శనివారం జరిగింది. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(వేములఘట్)కు చెందిన ఇర్కోటి శివయ్యకు మల్లన్నసాగర్ ప్రాజెక్టు పరిహారం డబ్బులు వచ్చాయి. ఈ విషయంపై తండ్రి మల్లయ్య, కొడుకు శివయ్య గొడవపడ్డారు. దీంతో శివయ్య టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ సైదా తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిద్దిపేటఅర్బన్: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, త్రీటౌన్ పోలీసులు కలిసి శనివారం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారిపై ఓ వే బ్రిడ్జి వద్ద ఆగిన బొలేరో వాహనాన్ని పట్టుకొని తనిఖీ చేశారు. సిద్దిపేటకు చెందిన మహ్మద్ షారుఖ్ తన సొంత వాహనంలో 41 క్వింటాళ్ల రేషన్ బియాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు.

గ్రామ దేవతలకు పూజలు

గజ్వేల్: మండలంలోని అనంతరావుపల్లి లో నిర్వహిస్తున్న గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాలకు ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరై శనివారం పూజలు నిర్వహించారు. అనంతరం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐకి సీపీ ప్రత్యేక అభినందన



ఏఎస్ఐ ఉమారెడ్డిని అభినందిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ఇటీవల బావి నుంచి మృతదేహాన్ని బయటకు తీసిన ఏఎస్ఐని సిద్దిపేట సీపీ అనురాధ ప్రత్యేకంగా అభినందించారు. ఈనెల 17వ తేదీన సిద్దిపేట శివారు వ్యవసాయ బావిలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. మృతదేహాన్ని బయటకు తీయడానికి గజ ఈతగాళ్లకు డబ్బులు ఇవ్వలేని స్థితిలో ఉన్న నిరుపేద కుటుంబ పరిస్థితిని సిద్దిపేట టూటౌన్ ఏఎస్ఐ ఉమారెడ్డి చూసి చలించిపోయారు. వెంటనే బావిలో దిగి గంటసేపు గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు. దీంతో పోలీసు అధికారులు ఆయనను అభినందించారు. శనివారం సీపీ కార్యాలయంలో ఏఎస్ఐకి సీపీ శాలువా కప్పి అభినందించి, నగదు రివార్డు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏసీపీలు మధు, పురుషోత్తంరెడ్డి, సతీష్, శ్రీనివాస్ టూటౌన్ సీఐ ఉపేందర్, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సీతారామ-ఉమామహేశ్వరుల కల్యాణానికి గోటి తలంబ్రాలు

గజ్వేల్: మే 2వ తేదీన గజ్వేల్‌లో జరగనున్న సీతారామ-ఉమామహేశ్వరుల కల్యాణానికి 20 కిలోల గోటి తలంబ్రాలను అందించనున్నారు. ఈ కార్యక్రమానికి శనివారం రామకోటి భక్తసమాజం నిర్వాహకుడు రామరాజు శ్రీకారం చుట్టారు. భద్రాచలం నుంచి తెచ్చిన వడ్లను గోటితో తలంబ్రాలుగా చేసి అందించనున్నారు. ఈ వడ్లను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు దూబకుంట ప్రభాకర్, సిద్ధి భిక్షపతి, నంగునూరి సత్యనారాయణ, దూబకుంట వెంకట్రాములు, గాలయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో మాట్లాడుతున్న రామకోటి రామరాజు

సీఎంను కలిసిన మైనార్టీ నాయకుడు



పుష్పగుచ్ఛం ఇస్తున్న ఖాజా ఆరీఫ్

మద్దూరు(హుస్నాబాద్): సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసినట్లు మద్దూరు మండల కేంద్రానికి చెందిన మైనార్టీ రాష్ట్ర నాయకుడు, అయిషాబీ ట్రస్ట్ చైర్మన్ ఖాజా ఆరీఫ్ శనివారం తెలిపారు. ముస్లిం, మైనార్టీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుండటం సంతోషంగా ఉందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ హరీశ్‌రావును విమర్శిస్తే సహించం

నంగునూరు(సిద్దిపేట): ప్రజల మనిషి ఎమ్మెల్యే హరీశ్‌రావును విమర్శిస్తే సహించేదిలేదని మాజీ ఎంపీపీలు శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య అన్నారు. శనివారం నంగునూరులో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో హరీశ్‌రావుపై బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గతంలో నిధులన్నీ సిద్దిపేటకే కేటాయిస్తున్నారని విమర్శించి నేడు ఈప్రాంతం అభివృద్ధి చెందలేదని ఎలా విమర్శిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్, హరీశ్‌రావుపై అసత్య ఆరోపణలు చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లింగంగౌడ్, ఎడ్ల సోమిరెడ్డి, రమేశ్‌గౌడ్, ఎంపీటీసీలు తిరుపతి, బాబు, కమలాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు షూ పంపిణీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): దివంగత గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే గజ్వేల్ సైదయ్య ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం రాయవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకట్‌కిరణ్ మాట్లాడుతూ తమ తాత పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ అశ్వ వాహనంపై ఊరేగింపు

బెజ్జంకి(సిద్దిపేట): శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బెజ్జంకిలోని ప్రధాన వీధుల్లో శనివారం స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. స్వామివారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఊరేగింపులో గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ హనుమాన్ హోమం

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములు హనుమాన్ హోమం నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. స్వాముల భజనతో ఆలయం మార్మోగింది.

◆ పిడుగుపడి పశువులు మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): పిడుగుపడి ఎద్దు మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని అందెలో శనివారం జరిగింది. అందె గ్రామానికి చెందిన మంద నర్సింహులు ఎద్దు పొలంలో మేత మేస్తుండగా పిడుగు పడటంతో అక్కడిక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని బాధితుడు నర్సింహులు కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో పిడుగు పడి గేదె మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ముంపు గుడాటిపల్లి గ్రామానికి చెందిన రైతు కలువల భూమిరెడ్డి తన గేదెను చెట్టుకు కట్టేశాడు. పిడుగు పడటంతో అక్కడిక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని రైతు వాపోయాడు. రైతుకు నష్టపరిహారం అందించాలని గ్రామ మాజీ సర్పంచ్ బద్దం రాజిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు.

◆ నేత్రపర్వంగా గరుడ వాహన సేవ



కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. శనివారం స్వామివారి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఊరేగించారు. ఊరేగింపులో చిన్నారుల నృత్యాలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. మహిళలు మంగళ హారతులతో స్వామివారికి స్వాగతం పలికారు. మాజీ సర్పంచ్ ఐలం సౌజన్యంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొల్కంపల్లి జయంతి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి దేవాలయం నిర్మించారు. ప్రతిష్ఠించనున్న అమ్మవారి విగ్రహానికి శనివారం గ్రామస్తులు జలాభిషేకం చేశారు. మరో రెండు రోజులు విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు కొనసాగుతాయని మాజీ సర్పంచ్ రమేశ్ తెలిపారు.

